17వ వసంతంలోకి
సూర్య
రంగారెడ్డి-వికారాబాద్-మేడ్చల్
బుధవారం 28 ఫిబ్రవరి 2024
పేజీలు : 8

## ట్రైనింగ్ కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణలో కొత్త విషయాలు తెలుసుకోవాలి

**- మంచిగా పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి : జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్న్యూస్ (ఫిబ్రవరి27)ః ట్రైనింగ్లో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు కొత్త విష యాలను తెలుసుకోవాలని జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. మం గళవారం జిల్లా కేంద్రంలోని వికా రాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ఏఆర్ ఎస్సిటిపిసిఎస్ (స్టైపండరీ క్యా డెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్)ల 9 నెలల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మిగతా 2లో

## జెండామోసిన కార్యకర్తలకు

# అండగా ఉంటాం



- ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తాం
- పేదలకు ఉద్యోగాలిస్తే బీఆర్ఎస్కు కడుపుమంట
- మెగా డీఎస్సీ వేసి పంతుళ్ల నియామకం
- కాంగ్రెస్ ప్రభుత్వం పోతుందంటే లాగుల్లో తొండలు విడువాలి
- దమ్ముంటే తెలంగాణలో ఒక ఎంపీ సీటు గెలువు కేటీఆర్కు సవాల్
- గుజరాత్ మోడల్ అంటే రైతులను కాల్చి చంపడమా?
- కాంగ్రెస్ను తట్టుకోలేక మోడీ,కేడీ చీకటి ఒప్పందాలు
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి





చేవెళ్ల, మేజర్న్యూస్( ఫిబ్రవరి 27) ః పదేళ్లు కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు అండగా నిలబడుతానని, కార్యకర్తల రుణం తీర్చుకునే బాధ్యత నాపై, పార్టీపై ఉందని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి అన్నారు. మిగతా 2లో

## ప్రజలు ఆరు గ్యారెంటీలను

# నమ్మే స్థితిలో లేరు

**: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



తుర్కయంజాలు, మేజర్ న్యూస్, (ఫిబ్రవరి 27) :కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధి, తుర్కయంజాలు మున్సిపాలిటీలోని మన్నెగూడ వేద ఫంక్షన్ హాల్లో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మిగతా 2లో

## హరితహారంలో లక్ష్యాలను అధిగమించేలా అధికారులు పనిచేయాలి

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ః 2024 సం.రానికి గాను హరితహారం లో భాగంగా లక్ష్యాలను అధిగమించేలా అధికారులు పనిచేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మిగతా 2లో

## పదవ తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**





వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్న్యూస్(ఫిబ్రవరి27)ఃజిల్లాలో జరిగే పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండ సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సుఫరింటెండెంట్లు పూర్తి బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం సమావేశం హాలులో విద్యా శాఖ అధ్వర్యంలో చీఫ్ సుపరింటేన్డెంట్లు, మండల విద్యాధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ..... జిల్లాలో జరిగే 10వ తరగతి పరీక్షల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పదవ తరగతి పరీక్షలు మార్చి 18 నుండి ఏప్రిల్ 2 వరకు ఉంటాయని, ఎక్కడ కూడా చిన్న సమస్య రాకుండా రూల్ ప్రకారం వెళ్లాలని, పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులు ఎవరిని కూడా పరీక్ష హాలులోకి అనుమతించరాదని, మాస్ కాపీయింగ్కు అవకాశం ఇవ్వరాదని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ఫర్నిచర్, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలను అధికారులందరు సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో డిఈఓ రేణుకాదేవి, ఎసిజిఇ రాంరెడ్డి, మండల విద్యాధికారులు , ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ ఏసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును మంగళవారం నాడు బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు రాచమల్ల సురేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

- మేజర్ న్యూస్ శంషాబాద్

## జెండామోసిన కార్యకర్తలకు

# అండగా ఉంటాం



మొదటిపేజీ తరువాయి... రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జానజాతర సభ నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్గంతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. గత ప్రభుత్వం కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి ఎంతోమంది ఆస్తులు ధ్వసం చేసిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడి కొట్లాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు మీ కష్టం, శ్రమ, రక్తం ఉందని, రక్తాని చెమటగా మార్చి గుండెల్లో పెట్టుకుని మోశారని తెలిపారు. కార్యకర్తల త్యాగాన్ని మరువమని, పదేళ్లు కాంగ్రెస్‌జెండా మోసిన కార్యకర్తలకు అండగా నిలబడుతామన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మపై అభిమానంతో ఇందిరమ్మ రాజ్యం తెచ్చారని, ప్రజలతో ఏర్పడ్డ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటిలు తప్పక అమలు చేస్తుందన్నారు. డిసెంబర్ 7న ప్రభుత్వం ఏర్పడి రెండు రోజులోనే రెండు గ్యారంటి పథకాలు ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ ఏర్పాటు చేశామన్నారు. 78రోజుల్లోనే మరో రెండు గ్యారంటి పథకాలు రూ.500 గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ తన కుటుంబంలో ఉద్యోగాలు ఇచ్చారే తప్ప లక్ష మంది యువతకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చామని, హామీ మేరకే 25వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. ఓర్వలేక కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు కాంగ్రెస్‌పై శాపనార్థాలు పెడుతున్నారని విమర్శించారు. పేదలకు ఉద్యోగాలు ఇస్తే ఎందుకింత కడుపు మంట అని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాలు రాక నిరుద్యోగులు పెళ్లిళ్లు చేసుకోలేక, రోడ్లపై తిరుగుతుంటే ఆలోచించలేదని, నిజమాబాద్‌లో బిడ్డ ఉద్యోగం పోతే పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, పేదల కోసం ఆలోచించని నువ్వు మనిషి రూపంలో ఉన్న మృగానివా అని విమర్శించారు. మార్చి నెలలో మరిన్ని ఉద్యోగాలు వేస్తామని, మెగా డీఎస్సీ పేద పిల్లలకు చదువు చెప్పేందుకు పంతుళ్ల నియామకం పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో పరీక్ష పత్రాలు జీరాక్స్ సెంటర్‌లో అమ్మకాలు జరిగేవని తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేశామన్నారు. 6నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పోతుందని బీఆర్ఎస్ నాయకులు అంటే వేప చెట్టుకు కట్టి లాగులో తొండలు వీడువాలన్నారు. దమ్ముంటే తెలంగాణలో ఒక పార్లమెంట్ సీటైన గెలిచి చూపించండి అని కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. అయ్యా పేరు చెప్పుకుని కూర్చీలో కూర్చోలేదని, కార్యకర్తగా కష్టపడి, జైళ్లలో బాధను అనుభవించనని, కేసీఆర్, కేటీఆర్,హరీష్‌రావు కుటుంబ పాలనను బొందపెట్టి కూర్చీలో కూర్చున్నామన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తల శ్రమ ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో మీరు కష్టపడితే 14సీట్లు గెలిచి ఢిల్లీకి పంపుతామన్నారు. ఎంపీ ఎన్నికలతో నా బాధ్యత తీరదని, క్రమశిక్షణ కార్యకర్తలను జడ్పీచైర్మెన్లు, జడ్పీటీసీ, మండల పరిషత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యుల హోదాలో గెలిచినప్పుడే నిజమైన నాయకులుగా ఉంటామన్నారు. మిమ్మల్ని గెలిపించే వరకు ప్రభుత్వం మీ వెంట పనిచేస్తుందన్నారు. బీజేపీ పదేపదే గుజరాత్ మోడల్ అంటుందని, గుజరాత్ మోడల్ అంటే 2కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోవడమా, రైతు ఆదాయం రెండింతలు పెంచకపోవడమా... ఢిల్లీలో ధర్నా చేసిన రైతులను కాల్చి చంపడమా.... ఇతర రాష్ట్రాల పెట్టుబడులను గుజరాత్ రాష్ట్రానికి తీసుకుపోవడామా అని విమర్శించారు. బీజేపీ నాయకులు కొత్తగా మోడీని ప్రధాని చేయాలని తిరుగుతున్నారని, మోడీ ప్రధానిగా లేరా.... సీఎంగా ఉన్నారా.... ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల చొప్పున పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈప్రాంతానికి నీళ్లు ఇవ్వాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రాణహితకు శిలఫలకం వేస్తే కేసీఆర్ పడవ్ పేడితే బీజేపీ పళ్లు ఇగిలించిదే తప్ప ప్రాజెక్టును పూర్తి చేయాలని చెప్పలేదన్నారు. కేడీ, మోడీ అల్లంబెల్లంలా ఉన్నారని, బీజేపీ, బీఆర్ఎస్ వేరు అని నాటకాలు ఆడుతున్నారని, ఇద్దరు చీకటి ఒప్పందాలు చేసుకున్నారని మండిపడ్డారు. మోడీ, కేడీ కాంగ్రెస్‌ను తట్టుకోలేక చీకట్లో కలిసి పగలు కోట్లాడుకుంటున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, జడ్పీచైర్‌పర్సన్లు సునీతామహేందర్‌రెడ్డి, తీగల అనితాహరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, సీఎం సలహదారులు వేం నరేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి, నియోజకవర్గం ఇంచార్జీ పామెన భీంభరత్, సోసైటి చైర్మెన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి తదితరులు ఉన్నారు.

## హరితహారంలో లక్ష్యాలను అధిగమించేలా అధికారులు పనిచేయాలి

మొదటిపేజీ తరువాయి...



మంగళవారం కలెక్టరేట్లోని కలెక్టర్ తన చాంబర్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా కార్యచరణ ప్రణాళిక పై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హరితహారంలో గత సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాలలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. మొక్కలు నాటడానికి అవసరమైన స్థలాలను గుర్తించాలని, హరిత నిధిలో ఎన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ అడిగి తెలుకున్నారు. గ్రామాలలో ఖాళీ స్థలాన్ని గుర్తించి గ్రామ పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎఫ్ఓ జానకి రామ్, పరిశ్రమ శాఖ అధికారి,పిడి డిఆర్డిఓ సాంబశివ రావు, ఉద్యానవన శాఖ అధికారిణి నీరజ గాంధీ, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఆరు గ్యారెంటీలను

# నమ్మే స్థితిలో లేరు



మొదటిపేజీ తరువాయి...



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ప్రజలు కాంగ్రెస్ పార్టీ చెప్పిన దొంగ మాటలను నమ్మలేదని, జిహెచ్ఎంసి పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు రాకుండా ప్రజలు తెలివిగా ఆలోచించారని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజవర్గం ప్రాంత ప్రజలు ఆరు గ్యారంటీల మాయలో పడి మోసపోవదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు కేసీఆర్ ను గుర్తు చేస్తున్నారని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కాలే యాదయ్య, అరికెపుడి గాంధీ, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేష్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, క్యామ మల్లేష్, డి సి సి బి అధ్యక్షులు కొత్త కురుమ సత్తయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రైనింగ్ కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణలో కొత్త విషయాలు తెలుసుకోవాలి

మొదటిపేజీ తరువాయి... ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఏఆర్ ఎస్‌సిటిపిసిఎస్ నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని తెలిపారు. 2024వ బ్యాచ్ కు చెందిన ఆసిఫాబాద్ నుండి 55, రామగుండం నుండి 109, సిద్దిపేట నుండి 60 మొత్తం 224 మంది ఏఆర్ ఎస్‌సిటిపిసిఎస్ అభ్యర్థులు శిక్షణ కొరకు జిల్లాకు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఏఆర్ ఎస్‌సిటిపిసిఎస్ స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. పోలీస్ నోటిఫికేషన్ వెలువడిన అనంతరం పోలీస్ ఉద్యోగ ఉత్తీర్ణత సాధించడం కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు అహోరాత్రులు కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారన్నారు. అందులో కొందరికే ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. మీరూ అందులో ఉన్నారన్నారు. తెలంగాణ పోలీసులకు బెస్ట్ పోలీస్ గా దేశం లోనే సముచిత స్థానం ఉందన్నారు. ప్రస్తుతం ట్రైనింగ్ లో ఉన్న ఎస్‌సిటిపిసిఎస్ లు ఖ్యాతిని ఉన్నతంగా నిలబెట్టాలన్నారు. కొత్త విషయాలను నేర్చుకోవడానికి ట్రైనింగ్ సమయం చక్కని అవకాశం అన్నారు. స్వీయ క్రమశిక్షణను పాటించాలన్నారు. నూతనంగా సెలెక్ట్ అయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు శాఖ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. పోలీస్ వృత్తి ఉన్నతమైనదన్నారు. నిరంతరం ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ట్రైనింగ్ సమయంలో ఇండోర్, అవుట్ డోర్ ట్రైనింగ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవుట్ డోర్ ట్రైనింగ్ లో భాగంగా యోగా, మెడిటేషన్, స్పోర్ట్స్, డ్రిల్, ట్యాక్టికల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, జీపీఎస్, వెపన్ ట్రైనింగ్ తదితర యాక్టివిటీస్ ఉంటాయన్నారు. ఇండోర్ ట్రైనింగ్ లో భాగంగా చట్టాలపై అవగాహన, లా అండ్ ఆర్డర్, సెక్యూరిటీ, జెండర్ సెన్సిటైజేషన్, వ్యక్తిత్వ వికాసం, కంప్యూటర్ ట్రైనింగ్ తదితర అంశాలపై తర్ఫీదునిస్తారన్నారు. ట్రైనింగ్



విజయవంతంగా పూర్తి చేసి జిల్లా కు మంచి పేరు తీసుకురావాలన్నారు. సమర్థత, వృత్తి నైపుణ్యం, నీతి నిజాయితీ తో విధులు నిర్వర్తించాలన్నారు. ట్రైనింగ్ రూల్స్ అండ్ రేగులేషన్స్ అన్నీ పాటించాలన్నారు. సోషల్ మీడియా పట్ల జాగ్రత వహించాలన్నారు. కానిస్టేబుళ్లు క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై పని చేస్తారని, పోలీస్ డెపార్ట్ మెంట్ లో వారి పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ యు.రవీందర్ రెడ్డి, డిటిసి అదనపు ఎస్పీ మురళీధర్, వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, తాండూర్ డిఎస్‌పి బాలకృష్ణ రెడ్డి, డిటిసి డిఎస్‌పి విజయ్ కుమార్, ఏఆర్ డిఎస్‌పి వీరేశ్, ఇన్స్పెక్టర్‌లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ పేరిట పేద ప్రజలపై అదనపు భారం

**● ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజ్ పేరిట ఫీజులు వసూలు చేయడం పేదలను హింసించడమే ● ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా చేస్తాం, రద్దు చేస్తాం, LRSకు న్యాయ వ్యతిరేక పోరాటం చేస్తామని గతంలో మాటిచ్చిన ఇప్పటి మంత్రులు ● కాంగ్రెస్ మంత్రులు నాడు ఓ మాట నేడు ఓ మాట ● 1 లేదా 2 శాతం తీసుకొని ఎల్ఆర్ఎస్ చేయాలని డిమాండ్ ● గృహ జ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ ను నూతన రేషన్ ఇచ్చిన తర్వాతే అమలు చేయాలే ● రేషన్ కార్డు లేని 30 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డు ఇవ్వాలి ● ఈ పథకాలపై షరతులు లేకుండా చూడాలని డిమాండ్ ● అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాలు అందే విధంగా చూడాలే**



ఘట్‌కేసర్, మేజర్ న్యూస్(ఫిబ్రవరి, 27):మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఎంపీటీసీలతో కలిసి పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాలు భాగంగా రెండు పథకాలను అమలు చేస్తుందని చెప్పిందని LRS పై మార్చ్ 31 తేదీ లోగా రుసుము చెల్లించాలని షరతు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు LRS పై పేద ప్రజలపై భారంపోతుందని 1 లేదా 2 శాతం తీసుకొని LRS చేయాలని డిమాండ్ చేశారు గృహ జ్యోతి, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ ను నూతన రేషన్ కార్డు ఇచ్చిన తర్వాతే ఈ పథకాలను అమలు చేయాలని ఇప్పటివరకు 30 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డు లేదని వారికి రేషన్ కార్డు అమలు చేసినట్లయితే ఈ పథకాలకు అర్హులు అవుతారని .LRS ను ఉచితంగా చేస్తాం,LRS ను రద్దు చేస్తాం,LRSకు న్యాయ వ్యతిరేక పోరాటం చేస్తామని గతంలో మాటిచ్చిన ఇప్పటి మంత్రులు. ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికల తర్వాత ఓ మాట అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ పథకాలపై షరతులు లేకుండా చూడాలని రాష్ట్రంలో కోటి కుటుంబాలకు పైగా ఉన్నారని అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాలు అందే విధంగా చూడాలని మీడియా ద్వారా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు భాస్కర్ రెడ్డి, రామారావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రెండవ రోజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**● చిర్యాల్ శ్రీ గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ● ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.**



మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఆలయ జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్ లక్ష్మీనారాయణ

కీసర,మేజర్ న్యూస్: చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో శ్రీ గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం రెండో రోజు వైభవంగా జరిగాయి. మంగళవారం స్వామి వారి ప్రతిష్ట మహోత్సవంకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ,మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డిలు విచ్చేయగా ఆలయ ఫౌండర్ &చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిలు వేదపండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అతిధులు స్వామి వారి దర్శనమనంతరం హెూమం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం వారికి స్వామివారి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు స్వామివారి చిత్రపటంతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మించినటువంటి శ్రీ గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్ ,కీసర మండలం ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



చీర్యాల ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి.

## పది గంటలకు ముందే దుర్గా వైన్స్ ఓపెన్

**● నిబంధనలను పాటించని దుర్గా వైన్స్ యాజమాన్యం**
**● చర్యలు తీసుకొని ఎక్సైజ్ శాఖ అధికారులు**
**● అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానిక ప్రజలు**




మేడ్చల్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27) :మద్యం షాపులు ఉదయం 10 గంటల కు తెరిచి రాత్రి 10 గంటలకు మూయాల్సిన వైన్ షాపుల యజమానులు కాస్త పది గంటలకు ముందే తెరిచి రాత్రి 10 గంటలు గడిచిన వైన్ షాపులు తెరవడంలో, మూయడంలో కనీస నియమ నిబంధనలు పాటించాల్సిన వైన్స్ యజమానులు పట్టించుకోకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాట అన్న తీరుగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం ముందు ఉన్న దుర్గా వైన్స్ మంగళవారం ఉదయం 9.52 గంటలకు తిరగడం పట్ల పక్కనే ఉన్న ఆస్పత్రి రోగులు, రోగులతో పాటు వచ్చే అటెండర్లు, అక్కడి నుంచే వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులపై తీవ్రంగా మండిపడుతున్నారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైన్స్ యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో దుర్గా వైన్స్ చుట్టూ ఉన్న ప్రజలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలను పాటించని వైన్స్‌లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కలెక్టరేట్ ఎదుట బి.ఎం.ఎస్ ధర్నా

**కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ః భారతీయ మజ్దూర్ సంఘ్ మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ రంగ పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అసంగటిత రంగ కార్మికుల కు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఈ.ఎస్.ఐ, ఫి.ఎఫ్ ఇవ్వాలని, ఆయుస్మాన్ భారత్ ను వర్తింప చేయాలని, స్ట్రీట్ వెండార్స్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ రామ్మోహన్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బి.ఎం.ఎస్ జాతీయ కార్యదర్శి వెంగల రావు, రాష్ట్ర కార్యదర్శి జె.శ్రీధర్, బి.ఎం.ఎస్ ప్రభారి ఏ.రాము, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ గౌడ్, ఉపాధ్యక్షులు ఉమా శంకర్, టి.శ్రీనివాస్, సీనియర్ నాయకులు టి.జయెందర్, కే.దశరథ్ లు పాల్గొన్నారు.



# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**● నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలలో నో ఎంట్రీ**
**● పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

మేడ్చల్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27) :పరీక్షల సమయం వచ్చేసింది.. విద్యార్థులకే కాదు.. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు కూడా ఒత్తిడి ఎదురుకానుంది.. ఎలాగైనా తమ పిల్లలు అందరికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఇటు విద్యాసంస్థల యాజమాన్యాలు, అటు అధ్యాపకులు మాత్రమే కాదు తల్లిదండ్రులు కూడా అశిస్తుంటారు.. చదువు విషయంలో ఇంట్లో తల్లిదండ్రుల నుంచి కాలేజీలో అధ్యాపకుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి లోనవుతుంటారు. ఒకవైపు ఆందోళన.. మరోవైపు అనారోగ్యం.. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షల సీజన్ కొనసాగనుంది.

**నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ :**

ఇంటర్మీడియట్ పరీక్షలలో నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించని నిబంధన ఉంది. ఉదయం 9 గంటలకే కంటే 15 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. స్మార్ట్ ఫోన్స్, మొబైల్స్, స్మార్ట్ వాచీలు పరీక్షా కేంద్రాలకు అనుమతి లేదు.

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ :**

ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెడ్డన్ జూనియర్ కళాశాల, అయాతి జూనియర్ కళాశాల, స్ఫూర్తి జూనియర్ కళాశాల, జాగృతి జూనియర్ కళాశాల, ఎన్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించే పరీక్ష కేంద్రాల వద్ద మేడ్చల్ మండల తహాసీల్దార్ ఆదేశాల మేరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పైన తెలిపిన 6 కాలేజీల వద్ద 144 సెక్షన్ విదించడం జరుగుతుందని మేడ్చల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ తెలిపారు. పరీక్షా సమయంలో పైన తెలిపిన కాలేజీల వద్ద నలుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది గుమిగూడటం, నిషేడించబడిన ఆయుధాలను కలిగి అట్టి ప్రదేశంలలో తిరగడం నిషేదం. పైన పేర్కొన్న కళాశాల వద్ద సుమారు 100 మీటర్ల వరకు జీరాక్స్ దుకాణాలను మూసివేయాలని ఆయన పేర్కొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి : శ్రీనివాసులు





షామిర్ పేట,మేజర్ న్యూస్(ఫిబ్రవరి,27):ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజరు శ్రీనివాసులు అన్నారు. లీడ్ బ్యాంకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా షామీర్పేట్ మండల కేంద్రంలో 2కె రన్ ర్యాలీని జడ్పిటిసి అనిత, ఎంపీడీవో మమత, ఎంఈఓ వసంత లక్ష్మి, జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పిల్లలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హెడ్మాస్టర్ వేణు మాట్లాడుతూ...... ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు, డిజిటల్ లావాదేవీలు చేసే సమమాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిన్, పాస్ వార్డు, ఓటిపి, సినివి నంబరు, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు చెప్పవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్ డి ఎం శ్రీనివాస్, జడ్పిటిసి అనిత, ఎంపీడీవో శ మమత, ఎంఈఓ వసంత లక్ష్మి, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



## బాణావత్ చందు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి 27) : మండల పరిదిలోని గడ్డమిది తాండ గ్రామ పంచాయతీ ఆర్లకుంటతండాలో బాణావత్ చందు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ భీమ్లాల్ నాయక్ 1లక్ష రూపాయల వ్యయంతో తాండాలోని 6 కూడలిలలో ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజల భద్రతకై తండాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బాణావత్ చందు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ భీమ్లాల్ నాయక్‌ను తాండ ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ భీమ్లాల్ నాయక్ మాట్లాడుతూ గడ్డమీద తాండ గ్రామపంచాయతీతో పాటు ఆర్ల కుంట తండా, కొత్త బాయి తాండలోని ప్రజల సమస్యల పరిష్కారానికి తమ తండ్రిగారు కీర్తిశేషులు చంద్రు నాయక్ పేరుపైన ఏర్పాటు చేసిన బాణావత్ చందు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన ప్రజల వెన్నంటి ఉంటూ సమస్యల పరిష్కారానికి ట్రస్టు ద్వారా సేవలందించడం జరుగుతుందని డాక్టర్ బిమ్లాల్ నాయక్ తెలియజేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని నిరుపేద ఆడబిడ్డ వివాహానికి 50 కేజీల బియ్యం, మృతి చెందిన కుటుంబానికి మూడు వేల ఆర్థిక సాయం, విద్యార్థుల పై చదువులకు చేయూత, క్రీడలలో పాల్గొనే యువతకు ట్రస్టు ద్వారా ప్రోత్సాహకాలు, తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ భీమ్లాల్ నాయక్ తెలియజేశారు. గ్రామస్థాయిలోని నిరుపేదలకే కాకుండా మండల స్థాయిలోని నిరుపేదలకు ట్రస్ట్ సేవలు అందేలా ప్రయత్నం చేయడం జరుగు తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాములు నాయక్, దాస్య నాయక్, పాండ్య నాయక్, భీమ్లాల్ నాయక్, కిషన్ నాయక్, దశరథం, శ్రీరామ్, క్రిష్ణ, రమేష్, పంతుల, బిచ్య, శ్రీను, పాండు, అభి, శ్రీను, రామ్, విట్టు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

**- ఎంపీటీసీ పల్లాటి జయానందం - మాజీ సర్పంచ్ పెర్క వినోద మూర్తి**



మంచాల, మేజర్ న్యూస్ (పిబ్రవరి 27) : గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీటీసీ పల్లాటి జయానందం అన్నారు. మంగళవారం లింగంపల్లి గ్రామంలో రూ. 5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ పెర్క వినోద మూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో సీసీ రోడ్లు, మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**- కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి**
**- మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



మంచాల, మేజర్ న్యూస్ (పిబ్రవరి 27) : యువత క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుంటూ, క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే తనయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆరుట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా ఈ నెల 22 న యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటు లో విజేతలుగా నిలిచిన జట్లకు మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే శారీరకంగా, మానసికంగా దృడంగా ఉంటారని అన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నేడు పిచ్చి మొక్కలతో నిండిపోయాయని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని అలవర్చుకొని జీవితంలో ఎదగాలని సూచించారు. మొదటి బహుమతి రూ.20 వేలు నగదు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు నగదు, మూడవ బహుమతి రూ. 10వేలతో పాటు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, నాయకులు భాషయ్య, పిఏసిఎస్ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు బుగ్గరాములు, క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పల్లెల అభివృద్ధి

**పిఏసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి**



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి 27) : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామీణ స్థాయిలోని మారుమూల పల్లెలు అభివృద్ధి చెందుతాయని పిఏసిఎస్ చైర్మెన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. మండల పరిదిలోని లింగరాపల్లి గ్రామపంచాయతీ, రామకృష్ణాపురంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తన నిధుల నుండి 10 లక్షల రూపాయలు సిసి రోడ్ల నిర్మాణానికి కేటాయించడం జరిగింది. మంగళవారం పిఏసిఎస్ చైర్మెన్ గట్ల కేశవరెడ్డి శతాబ్ది టౌన్షిప్ మేనేజ్మెంట్ డైరెక్టర్, చైర్మెన్ కాసు శ్రీఇవాస్‌రెడ్డితో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మెన్ గట్ల కేశవరెడ్డి, శతాబ్ది టౌన్షిప్ మేనేజ్మెంట్ డైరెక్టర్ చైర్మెన్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జోగు రమేష్, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య, మాజీ ఉపసర్పంచ్ మణికంఠ, మాజీ వార్డు సభ్యులు జలంధర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, అచ్చిరెడ్డి, సురేందర్ రెడ్డి, మండల కోఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, పర్తిపురం యాదయ్య, చింతలపల్లి జంగారెడ్డి, రాములు, పడకల్ జగ్గారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామంలోని యువకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు

**-కందుకూరులో 3 సెంటర్లు,2340 మంది విద్యార్థులు -ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు -ఉదయం 8 గంటల వరకు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి**



కందుకూరు, మేజర్‌న్యూస్ ( ఫిబ్రవరి 27):తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి 14 వరకు పరీక్షలు జరుగనున్నాయి. మండల వ్యాప్తంగా 3 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం 1127, ద్వితీయ సంవత్సరం 1123 విద్యార్థులు 2470 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ కళాశాలలో 590, తెలంగాణ ఆదర్శ కళాశాలలో 1083, విద్యామయి జూనియర్ కళాశాలలో 674 మంది విద్యార్థులు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు, విద్యార్థులు ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఉమాదేవి, శ్రీధర్, బాల్‌రాజ్ లు సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కే ంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

## రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్‌ను సన్మానించిన ఆచారి



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27 ) కొల్లాపూర్ కు చేరుకున్న బిజెపి విజయసంకల్ప యాత్రలో పాల్గొనటానికి హైదరాబాద్ నుంచి ఆమనగల్లు గుండా వెళ్తున్న రాజ్యసభ సభ్యులు బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే. లక్ష్మణ్ ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ఆమనగల్లులో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమనగల్లు బిజెపి పార్టీ కార్యాలయములో కొద్దిసేపు ఆగారు. ఆయన వెంట బిజెపి కల్వకుర్తి తాలుకా సీనియర్ నాయకులు ఆమనగల్లు మున్సిపాలిటీ కన్వీనర్ శ్రీకాంత్ సింగ్, కౌన్సిలర్ లు నాయకులు శ్రీశైలం యాదవ్, ఝాన్సీ శేఖర్, చెన్నకేశవులు, దుర్గయ్య, తెలంగాణ బిజెపి పార్టీ ఎస్టి మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ రవిరాథోడ్, ఆమనగల్లు మున్సిపాలిటీ మీడియా ఇంచార్జ్ పద్మ ప్రశాంత్, మహేష్, నరేష్, శ్రీకాంత్ బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**- వైద్యులు సకాలంలో హాజరు కావాలి - రోగులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి - యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య భాష**



యాచారం మేజర్ న్యూస్ ( ఫిబ్రవరి 27): మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యభాష అన్నారు. మంగళవారం అనంతరం ఆమె యాచారం ప్రాథమిక ప్రభుత్వాసుపత్రి సందర్శించారు. కొత్తగా 9 మంది స్టాఫ్ నర్సులు బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వాసుపత్రిని రోగులకు వైద్య సేవలు అందించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు వైద్యంతో పాటు ఆసుపత్రిని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. వేసవి కాలం ప్రారంభ దశలోని రోగుల సంఖ్య పెరుగుతున్న సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లేనియెడల రోగులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజలక్ష్మి. స్టాఫ్ నర్స్ భారతమ్మ. జయ కుమారి. జ్యోతి. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను వారంలో పూర్తి చేయాలి

● వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి27)ఃజిల్లాలో ఉపాధి హామీ పథకం క్రింద జరిగే పనుల లక్ష్యాలను వారం లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్ని మండలాల తహసీల్దార్, ఏంపిడిఓలకు ఆదేశించారు. మంగళవారం ఉదయం అన్ని మండలాల తహసీల్దార్లకు, ఏంపిడిఓలకు ఆయన టేలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లేబర్ను మోబి లైజే చేయడం, ఉపాధి కలిపించడం, గ్రామానికి ప్రజలకు ఉపయోగ పడే పనులు చేయాలనీ, ప్రతి గ్రామా పంచాయతీలో బిల్డింగ్ల ఎప్టిఓను జనరేట్ చేయాలని, పెండింగ్ ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్బంగా అన్ని మండలాల తహసిల్దర్లతో , ఏంపిడిఓలతో గ్రామాలలో జరిగే ఉపాధి హామీ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేపటి నుండి మొదలయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు మీ మండలంలో ఉండే పరీక్ష సెంటర్లను విజిట్ చేయాలనీ, అన్ని సౌకర్యాలు చెక్ చేసుకోవాలని, ప్రతి రోజు పరీక్ష జరిగే సమయంలో సెంటర్ను ఆకస్మిక తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి కాపీ జరుగకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ జిల్లాలో హోర్డింగ్స్ , ఫ్లెక్సిలను 24 గంటలలో తొలగించాలని, ఎన్నికల నియమాలను పూర్తి స్థాయిలో పాటించాలని అధికారులకు ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్సులో అన్ని మండలాల తహసీల్దారులు, ఎంపిడిఓలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న బిజెపి నాయకులు.

కుల్కచర్ల రూరల్,మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ఃచేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు కుల్కచర్ల మండల కేంద్రంలోని భారతీయ జన తా పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గాదె మహిపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్ రావు మాట్లాడుతూ...గత పదేండ్ల నుంచి చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కె.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన చేస్తున సేవలను కొనియాడారు. అనంతరం జస్టిస్ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తండ్రిని కోల్పోయిన పేద విద్యార్థి మన్సుర్ శాకు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. నీతికి, నిజాయితీకి, నిస్వార్ధానికి నిలువెత్తు రూపం. చేవెళ్ల ప్రజల హృదయాలను గెలిచిన జనం కోసం తపించే నేత జనం మెచ్చిన



పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు.

మంచితనం చేవెళ్ల ప్రజల గొంతుక కొండ విశ్వేశ్వర్ రెడ్డి అని అన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గణపురం వెంకటయ్య గౌడ్, కెఎంఆర్ ఫౌండేష న్ పరిగి ఇన్చార్జి రామచంద్రయ్య, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాటన్ పల్లి అంజియ్య, మాజీ సర్పంచ్ డాక్టర్ జానకిరామ్ చౌహన్, మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ హనుమంతు, యువ మోర్చా మండల అధ్యక్షులు గడసు మహిపాల్, మాజీ వార్డు సభ్యులు మహిపాల్, సీనియర్ నాయకులు నీరటి కర్ణయ్య, మండల గరుడ వాలం టరీ బైరం నరేష్, పాండు నాయక్, అనంతసాగర్ బూత్ అధ్యక్షులు పోశయ్య, బీరయ్య, లక్ష్మయ్య, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో 8 ఇంటర్ పరీక్ష కేంద్రాలు

● నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

● పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టిన అధికారులు



తాండూరు మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ః తాండూరు పట్టణంలో ఇంటర్ పరీక్ష కేంద్రాలను మొత్తం ఎనిమిది ఏర్పాటు చేశారు. నేటి నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు,చైతన్య కళాశాల,సింధు బాలికల జూనియర్ కళాశాల,అంబేద్కర్ ఓకేషనల్ జూనియర్ కళాశాల తోపాటు హైద్రాబాద్ రోడ్డు మార్గంలోని టి.ఎం.ఆర్.జే.పి,తదితర చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఈ పరీక్షలు ఉదయం 9:00 నుంచి ప్రారంభమై 12:00 వరకు జరగనున్నాయి.పరీక్షలు వ్రాసే వారు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకో వాలని, ఒక నిమిషం ఆలస్యం ఐన అనుమతి ఇవ్వమని అధికారులు పేర్కొన్నారు. ఈ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో కొనసాగనున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షణ అధికారులు, ఇన్విజిలేటర్స్,ఇతర సిబ్బంది ఎవరు కూడా ఫోన్ లు వాడకూడదని నిషేధం విధించారు.విద్యార్థులు మాల్ -ప్రాక్టీస్ కు పాల్పడితే క్రిమినల్ కేసుల తోపాటు డిబార్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నాడు పలు పరీక్ష కేంద్రాలను తాండూరు తహశీల్దార్ తారసింగ్ తోపాటు ఇతర అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి తీరుతెన్నుల ను తెలుసుకున్నారు.ప్రతి పరీక్ష కేంద్రం దగ్గర 144 సెక్షన్ విధించినట్లు తాండూరు టౌన్ సిఐ సంతోష్ కుమార్ వెల్లడించారు. ఎవరైనా పరీక్ష కేంద్రాలలో కి రావడానికి చుస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

# నిరుపేదలకు అభాగ్యులకు అండగా

# సన్ రైస్ చారిటబుల్ ట్రస్టు – అధ్యక్షుడు సుందర్ రావు



సంజయ్ కుమార్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రతినిధులు.

ఘట్‌కేసర్ రూరల్, మేజర్‌న్యూస్(ఫిబ్రవరి 27) : నిరుపేదలకు అభాగ్యులకు సన్ రైస్ చారిటబుల్ ట్రస్టు ఎప్పుడు అండగా ఉంటుందని అధ్యక్షుడు సుందర్ రావు అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన నిరుపేద జర్నలిస్టు సంజయ్ కుమార్ రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకుంటుండడంతో ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయల ఆర్థిక సహాయం స్ఫూర్తి ఆర్గనైజేషన్ సభ్యులు, సన్ రైస్ చారిటబుల్ ట్రస్టు సభ్యులతో కలసి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు అనతికాలంలోనే ఎంతో మందికి ఆర్థికంగా అండగా నిలిచిందని అన్నారు. సామాజిక సేవా రంగంలో మరింత ముందుకు సాగడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సన్ రైస్ ట్రస్టు సభ్యులు శ్రీకాంత్, ఐలయ్య, వీరారెడ్డి, అనిల్ కుమార్ సింగ్, వరికుప్పల లింగస్వామి, స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కుంటోళ్ళ యాదయ్య, ప్రధాన కార్యదర్శి కంధి సత్యనారాయణ, సభ్యులు లంబ రాజు, తాల్క రాములు, జహిరోద్దీన్, బొడ్డు నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు ఆరోగ్య కిట్టు అందజేత



మాతా శిశు ఆరోగ్య కిట్టు అందిస్తున్న సిహెచ్ఓ చంద్రప్రకాష్.

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ఃకుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మదిపాల్ గ్రామానికి చెందిన శిరీష డెలివరీ కావడంతో కమ్యూనిటీ హెల్త్ అధికారి చంద్ర ప్రకాష్ మాతా శిశు ఆరోగ్య కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతా శిశు సంక్షేమానికి ఆరోగ్య కిట్టు ఎంతో గాను ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో స్టాఫ్ నర్స్ మౌనిక, తదితరులు ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలి

● పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి



చెత్తను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి.

కుల్కచర్ల రూరల్,మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ఃపరిసరాల పరిశుభ్రత కు ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాల యం వెనుకల భాగంలో పంచాయితీ కార్మికుల చేత చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఒక్కరు చెత్తను సేకరించి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళలకు ఉచితంగా స్వయం ఉపాధి శిక్షణ తరగతులు

● లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి27): గ్రామీణ మహిళలకు కాస్ట్యూమ్స్, ఇమిటేషన్, వన్ గ్రామ్ జ్యూవెలరీ తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్, జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ (ముచ్చింతల్)ల సంయుక్తంగా ఫిబ్రవరి 28 నుండి 13 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. శిక్షణకై ఆసక్తి గల మహిళలు 19 నుండి 45 సంవత్సరాల వయసు లోపు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫారంతో పాటు టూల్ కిట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. జ్యూవెలరీ శిక్షణకు దరఖాస్తు చేసుకునే మహిళలు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో జిఎస్ఆర్ కృష్ణ, డైరెక్టర్ యూనియన్ బ్యాంక్, స్వర్ణ భారత్ ట్రస్ట్ , ముచ్చింతల్, రంగారెడ్డి జిల్లాలో సంప్రదించవచ్చని తెలిపారు. ఏదేని సమాచార నిమిత్తం 9391487797, 9177141712, 6301890681, 9618534720 నంబర్ల ద్వారా పొందవచ్చని ఆయన తెలిపారు.

# శ్రీశైలం బయలుదేరిన శివ స్వాములు



దౌల్తాబాద్ మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ః మండలంలోని చెల్లాపూర్‌లో శివ స్వాములు పాదయాత్ర గా శ్రీశైలం వెళ్ళారు. ఈ కార్యక్రమంలో యూ దేవేందర్, కె.నరేష్, ఆర్. మహేష్, కె. శ్యామప్ప, గొల్ల మాణిక్యప్ప, శ్యామ్ సుందర్ (సూర్య రిపోటర్), పవన్ రాజు, గురు భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారిని నమ్మిన రైతులు.. వారినే నట్టేట ముంచేసిన వైనం

- రైతుభీమానిధులు ఎలా దారి మళ్లాయి.. ఏఈఓకు ఎవరు సహకరించారు? - గత పాలకుల కనుసన్నల్లో రైతుబంధు, రైతుభీమా రూ.2కోట్ల నిధులు స్వహా - ఏఈఓ వద్దకు రైతుల పాస్ పుస్తకాలు, డెత్ సర్టిఫికేట్లు ఎలా వచ్చాయి? - రూ. 2 కోట్ల ప్రభుత్వ నిధులను దారి మళ్లించడంలో ఎవరి పాత్ర ఎంత ?

- అమాయక అన్నదాతలను నిలువునా ముంచేసిన కొందుర్గు ఏఈఓ శ్రీశైలం





కొందుర్గు, మేజర్ న్యూస్ ( పిబ్రవరి 27 ) : గత బిఆర్ఎస్ ప్రభుత్వం అన్నదాతల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రైతుబంధు, రైతుబీమా పథకాలను అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చెంద్రశేఖర్‌రావు అందుబాటులోకి తీసుకవచ్చారు. అధికారులు పాలకులు కుమ్మక్కై అన్నదాతలను మోసం చేస్తూ అందినకాడికి నిధులను దోచేశారు. గత బిఆర్ఎస్ పాలకుల కనుసన్నాల్లోనే ఈతతంగం మొత్తం జరిగినట్లు కొందుర్గు ఏఈఓ శ్రీశైలం పోలీసులు ముందు ఒప్పుకున్నట్లు తెలిసింది. అసలు కథ ఇక్కడే మొదలైంది. రైతుభీమా ఐదు లక్షలు కావాలంటే మరణించిన అన్నదాత పట్టదారు పాస్ పుస్తకంతో పాటు మరణించినట్లు దృవీకరణపత్రం కావలసి ఉంటుంది. ఈ పత్రాలు ఏఈఓ శ్రీశైలం వద్దకు ఎలా వెళ్ళాయి... ఇందుకు ఏ రాజకీయ నాయకులు సహకరించారనే కోణంలో పోలీస్ అధికారులు ముమ్మరంగా విచారణ మొదలుపెట్టారు. ఇదే తరహాలో రైతుబంధు నిధులు సైతం కాజేయడం మొదలు పెట్టారు. ఇలా మొత్తం 150 మంది అన్నదాతలను మోసం చేసి వారికి ప్రభుత్వం నుండి వచ్చిన 2 కోట్ల నిధులను అప్పనంగా మింగేశాడు. రైతు బందు పథకానికి చెందిన 130 మంది అన్నదాతలు, రైతు భీమాకు చెందిన 20 మంది రైతులను నిలువునా ముంచేసి 2 కోట్లు నిధులను కాజేశాడు. వచ్చిన నిధులతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండల కేంద్రంలో 2.35 గుంటలు జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో 8.20 గుంటలు చొప్పున మొత్తం 11.15 గుంటలు భూమిని కొనుగోలు చేసినట్లు సమాచారం. 2 కోట్ల నిధులు దారి మళ్లించడంతో వ్యవసాయ విస్తరణ అధికారి గొరేంటి శ్రీశైలంకు ఎవరు సహకరించారోననే విషయం పై కొందుర్గు మండలంలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఏఈఓ ఒక్కరే కాకుండా మరి కొంత మంది సిబ్బంది, రాజకీయ నాయకులు పూర్తి సహాయసహకారాలు అందించారేమోననే అనుమానాలను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న అమాయక అన్నదాతలను ఆసరగా చేసుకుని ఇష్టారాజ్యంగా ప్రభుత్వ నిధులను దోచేశారని మండి పడుతున్నారు. రైతుబంధు, రైతుభీమా నిధులు రావడం లేదని అనేక సార్లు కొందుర్గు మండల వ్యవసాయ విస్తరణ అధికారి కార్యలయానికి వెళ్ళినప్పుడు వస్తాయిలే.. దాటేసారే తప్ప ప్రభుత్వం నుండి రానివ్వకుండా అడ్డంగా దోచుకున్నారని మండి పడుతున్నారు. వ్యవసాయ కార్యాలయానికి వచ్చినప్పుడల్లా పట్టదారు పాస్ పుస్తకం, ఆదార్‌కార్డు,బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్‌లు ఇవ్వాలని చెప్పి ఇప్పించుకోవడంతోనే అసలు మోసం జరిగిందని రైతులు మండి పడుతున్నారు. అన్నదాతల నోటి వద్దకు వచ్చిన నిధులను తిన్న ఏఈఓ నుండి కక్కించెందుకు పోలీస్ అధికారులు, కఠినంగా శిక్షించి ఆ నిధులను రైతులకు అందేవిధంగా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

# వాసవి వేల్ఫేర్ అసోసియేషన్ మణికొండ వారిచే అల్పాహార పంపిణీ



మణికొండ, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ః మణికొండ మున్సిపల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ సమయానంతరం సాయంత్రపు అదనపు తరగతులకు హజరయ్యే 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం మిఠాయి, కారప్పూస అల్పాహారంగా వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ మణికొండ వారి తరపున అధ్యక్షులు వీ. యాదగిరి (గొల్డెన్ ఓరియల్ అపార్ట్‌మెంట్ నివాసి) రామలింగం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర ంజన్ సమక్షంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అల్పాహార వ్యవస్థ చూస్తున్న వీ ఆర్ ఫర్ యు సహయోగ్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ ఫ్లోర్ లీడర్ రామక్రిష్ణారెడ్డి, కొశాధ్యక్షుడు దిలీప్ కక్కడ్, సభ్యులు రాజశేఖర్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

# దోమల బారి నుండి ప్రజలను కాపాడాలి



మణికొండ, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27)ః దోమల భారి నుండి ప్రజలను కాపాడాలని కౌన్సిలర్ పద్మారావు అన్నారు. మణికొండ మున్సిపల్‌లోని ఇరిగేషన్ మరియు సిఎడి అధికారులకు 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావు ఇబ్రహింబాగ్ లేక్ సర్వే నెంబర్ 44లో క్లీన్ చేయించాలని దీని వలన దోమల బెడద ఎక్కువగా ఉందని, దీనిని పరిశుభ్రం చేసి డెంగ్యూ, మలే రియా భారిన పడకుండా కాలనీవాసులకు ర క్షణ కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ మరియు సిఎడి అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# 500కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్ ప్రారంభం

## హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జల్ పల్లి, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27):కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 500కే గ్యాస్,ఉచిత విద్యుత్ ప్రారంభం పై హర్షం వ్యక్తం చేస్తున్న జల్ పల్లి కాంగ్రెస్ నాయకులు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ గ్యారెంటీలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రారంభించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని దశ దిశ నిర్దేశం చేసిన కాంగ్రెస్ అగ్ర నాయకత్వం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,ఎన్నికల ప్రచార సభలో గ్యారంటీలు ప్రకటించిన సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు కర్గే కి తెలంగాణ స్టేట్ చేనేత విభాగం జనరల్ సెక్రెటరీ అంకం శ్రీనివాస్,రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం వీవర్ సెల్ అధ్యక్షులు మస్న రవికుమార్ కాంగ్రెస్ నాయకుల తరపున హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# దెబ్బడగూడలో రెండు ఇళ్లలో చోరీ




కందుకూరు, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): రెండు ఇళ్లలో చోరీ ఘటన మండల పరిధిలోని దెబ్బడగూడలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సురసాని కమలమ్మ వేరే గ్రామానికి వెళ్ళగా దొంగలు చోరీకి పాల్పడి ఇంట్లోని రూ.40 వేల రూపాయల నగదు,తులం బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే, గ్రామానికి చెందిన కళ్లెం లక్ష్మమ్మ వేరే గ్రామానికి వెళ్లగా ఇంట్లో దొంగలు పడి 10 తులాల వెండి పట్టా గొలుసులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇళ్లకు తాళాలు తీసి ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ మక్బుల్ జానీ తెలిపారు.

# ఝగాడియా సైట్‌లో రెనోడివ్ ఉత్పత్తి ప్లాంట్ విస్తరణను పూర్తి చేసిన లానెక్సెస్ ఇండియా

హైదరాబాద్, మేజర్ న్యూస్: స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లానెక్సెస్ ఫిబ్రవరి 1, 2024న ఝగాడియాలో తన రెనోడివ్ ప్రొడక్షన్ లైన్ విస్తరణను విజయవంతంగా పూర్తి చేసి, అమలులోకి తెచ్చింది. ఈ కొత్త కేంద్రంతో, కంపెనీ యొక్క రైన్ కెమీ బిజి నెస్ యూనిట్ తన ఉత్పత్తి సామర్థ్యాలని గణనీయంగా పెంచింది. భారత ఉపఖండం మరియు ఆసియా టైర్ మరియు రబ్బరు వస్తువుల మార్కెట్లలో పెరుగుతున్న డి మాండ్ ను ఇది తీర్చగలుగతుంది.కొత్త ఉత్పత్తి లైన్ అత్యాధునిక పరికరాలు, సాంకేతికతను కలిగి ఉంది. అధిక నాణ్య త సాంకేతికత టైర్ విడుదల ఏజెంట్లను మరింత సమర్ధవంతంగా ఉత్పత్తి చేయడానికి ఇది లానెక్సెస్ కు వీలు కల్పిస్తుంది. ఈ సందర్భంగా లానెక్సెస్ సీఈఓ, బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ ఛైర్మన్ మథియాస్ జాచెర్ట్ మాట్లాడుతూ భారతదేశం మాకు ఒక ముఖ్యమైన ప్రాంతం. ఈ వ్యూహాత్మక మైలు రాయి ఈ ప్రాంతంలో మా విలువైన కస్టమర్ల పెరుగుతున్న డిమాండ్లను తీర్చడంలో మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ కొత్త కేంద్రం మా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొం దించడమే కాకుండా భారతీయ మార్కెట్ అపారమైన సామర్థ్యంపై మా విశ్వాసాన్ని కూడా ప్రదర్శిస్తుంది అని అన్నారు.రీన్ కెమీ బిజినెస్ యూనిట్ గ్లోబల్ హెడ్ డా. జెన్స్ హెండ్రిక్ ఫిషర్ మాట్లాడుతూ, ఝగాడియా సైట్లో మా రెనోడివ్ ఉత్పత్తి శ్రేణి విస్తరణ లానెక్సెస్ ఇండియాకి ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఇది రబ్బరు పరిశ్రమకు నమ్మకమైన భాగ స్వామిగా మా స్థానాన్ని బలోపేతం చేస్తుంది మరియు వినూత్నత, సుస్థిరత్వం పట్ల మా నిబద్ధతను ప్రదర్శిస్తుంది

# విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ




మహేశ్వరం, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27):మోడల్ స్కూల్ మహేశ్వరంలో జనవరి 30న ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ హైదరాబాద్ ,విజన్ భారత్ యుకే వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలలో కళ్లద్దాల అవసరం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ విధ్యార్థులు మంచి పౌష్ఠికాహారం తీసుకోవడం,ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవడం వలన అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవడంతో పాటు చదువులో రాణించగలరని తెలిపారు.సామాజిక సేవాదృక్పతం కలిగి విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేసిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో జకీన్ ,వీరు విధ్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల భారీ బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



చేవెళ్ల సభకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ నేతలు.

కుల్కచర్ల,మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27):కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారెంటీ పథకాలలో భాగమైన మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించబోతున్న తరుణంలో మంగళవారం కుల్కచర్ల మండలం నుండి కాంగ్రెస్ నాయకులు చేవెళ్ల భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను పక్కాగా అమలు చేసి తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి భీంరెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బిఎస్ ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల నాయకులు బచ్చిరెడ్డి, మోత్కూరి వెంకటేష్, కర్మూరి రాంరెడ్డి, తమ్మలి రామచంద్రయ్య, అజ్మీర్, అక్బర్, ఉస్మాన్, తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేస్తుంది

- కాంగ్రెస్ భారీ బహిరంగ సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులు
- జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పూడూరు మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. చేవెళ్లలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభలో రెండు గ్యారెంటీలను సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరు గ్యారెంటీ పథకాలలో 500 కే గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఆరు గ్యారెంటీ ల కొరకు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోలేని వారు ఎంపిడిఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సొసైటీ చైర్మన్ సతీష్ రెడ్డి, యువ నాయకులు డాక్టర్ రితిక్ రెడ్డి, డిసిసి ప్రధాన



కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మణ్, నాయకులు కాటం రామచంద్రయ్య, సురేందర్, నరేష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు కొడంగల్ ఎస్ఐ భరత్‌రెడ్డి



కొడంగల్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటుందని కొడంగల్ ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కేంద్రాల దగ్గర ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా ఇంటర్మీడియేట్ పరీక్షల సమయంలో కొడంగల్ మున్సిపల్ పరిధిలోని జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయాలని సూచించారు. లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గ్రామాలలో పేరుకుపోయిన చెత్తచెదారం



దోమ, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): గ్రామాలలో ప్రత్యేక పాలన కొనసాగుతున్న పారిశుధ్యం పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతుంది. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో పాటు నాళాలలను పరిశుభ్రం చేయలేని దుస్థితి నెలకొంటుంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో పారిశుధ్య పనులు అధ్వానంగా తయారయ్యాయి. వీధులు ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో పాటు మూళ్ల కంచెలు, నాళాలు అపరిశుభ్రతగా మారడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఎప్పుడు ఎలాంటి రోగాలకు గురవుతామోనని ఆదేవన చెందుతున్నారు. పర్యావేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శి అటు వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో అపరిశుభ్రత నెలకొల్పి దోమలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. అటు ప్రత్యేక అధికారులు సైతం గ్రామానికి రావడం లేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు తమ గ్రామాన్ని సందర్శించి వెంటనే అపరిశుభ్రంగా ఉన్న వీధులను పరిశుభ్రత పరిచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ అభ్యర్థులకు... ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తుల ఆహ్వానం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని అర్హత కలిగిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులకు తెలంగాణా స్టేట్ ఎస్సీ స్టడీ సర్కిల్ రంగారెడ్డి జిల్లాలో ఐదు నెలల పాటు రాష్ట్ర ఉద్యోగ, ఆర్.ఆర్.బి, బ్యాంకింగ్, యస్.యస్.సి అర్హత పోటీ పరీక్షల కొరకు ఉచిత శిక్షణ ఇవ్వనుందని, ఈ శిబిరంలో చేరడానికి ఈ నెల 23 నుంచి ఆన్లైన్ దరఖాస్తులను www.tsstudycircle.co.in సైట్ ద్వారా, మార్చి 6 లోపు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జి. వినోద్ కుమార్ సూచించారు. మార్చి 10న జరిగే ప్రవేశ పరీక్షలో మార్కుల ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని, 11 జిల్లా బ్రాంచ్ లలో ఎక్కడైనా రెగ్యులర్ గా 5 నెలల ఫౌండేషన్ కోర్స్ తీసుకున్నవారు, రాష్ట్ర స్టడీ సర్కిల్ హైదరాబాద్ వద్ద సివిల్ సర్వీస్ కోసం కోచింగ్ తీసుకున్నవారు తిరిగి శిక్షణకు అనర్హులని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9618266091కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## అంగన్వాడి చిన్నారులకు అండగా... హెచ్‌బిఎల్ కంపెని



శామీర్‌పేట, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి, 27) :అంగన్వాడి చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి హెచ్ బి ఎల్ కంపెనీ తరుపున పౌష్టికాహారం అందజేస్తున్నామని హెచ్ బిఎల్ కంపెనీ ప్రతినిధి విజయ లక్ష్మి అన్నారు.సోమ వారం షామిర్ పేట మండలంలోని యడారం గ్రామ పంచాయతీలోని అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులకు కథలు, పాటలు చూడటానికి ఎల్డి వీడియోలను అందజేశారు. పౌష్టికాహరంలో బాగంగా ప్రతిరోజు పాలు, చిక్కిళ్లు, అరటిపండ్లు,అవసరమైన సామగ్రి పలకలు, ప్రెషర్ కుక్కర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారిణి,మండల పంచాయతీ అధికారిణి మంగ తయారు,గ్రామ కార్యదర్శి పి.ప్రమీలదేవి,గ్రామ మాజీ సర్పంచ్ వై.సుజాత, అంగన్వాడీ టీచర్ మమత, బాలమని, అంగన్వాడీ చిన్నారుల తల్లి తండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# మెట్లకుంటలో పర్యటించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

బొంరాస్‌పేట్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట గ్రామంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మెట్లకుంట గ్రామంలోని హనుఆన్ దేవాలయం పక్కన ఉన్న మినీ పార్కు ముందు, పోచమ్మ కాలనీ, కోతులకుంట కాలనీలో ఉపాధిహామీ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనులు ఇష్టానుసారంగా చేపడితే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. జిల్లాలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ శ్రీరాములు, డీఈ సుదర్శన్‌రావు, ఏఈ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సిద్ధు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మార్పీస్ మండల కమిటీ ఎన్నిక



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ నాయకులు

కొడంగల్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27):
ఎమ్మార్పీస్ కొడంగల్ మండల కమిటీని బుధవారం ఎన్నుకోనున్నట్లు ఎమ్మార్పీస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత మూడు దశాబ్దాలుగా మాదిగల మరియు ఉప కులాల సంక్షేమం కోసం విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో సమాన వాట కోసం పోరాటం జరుగుతుందన్నారు. అదే విధంగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని సంస్థాగతంగా నిర్మాణం కోసం అన్నీ మండలాల్లో ఎమ్మార్పీస్ కమిటీలను ఏర్పాటు చేయడంలో భాగంగా బుధవారం కొడంగల్‌లో మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్నీ గ్రామాల మాదిగ మరియు ఉప కులాల కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్కప్ప, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ, నాయకులు అంజి, నవీన్, మధు, ప్రకాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి ఆర్థిక సహాయం



లక్ష్మయ్య కుమారుడు సిద్ధార్థకు ఆర్థిక సహాయం అందిస్తున్న లక్ష్మయ్య స్నేహితులు

బొంరాస్‌పేట్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): బొంరాస్‌పేట్ మండలంలోని బురాన్‌పూర్ గ్రామంలో సోమవారం విద్యుత్‌షాక్‌తో చనిపోయిన లక్ష్మయ్య, లక్ష్మీ కుటుంబానికి లక్ష్మయ్య పదో తరగతి బ్యాచ్ స్నేహితులు ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం లక్ష్మయ్య స్నేహితులు బురాన్‌పూర్ గ్రామానికి చేరుకొని లక్ష్మయ్య కుమారుడు సిద్ధార్థకు రూ.55వేల ఆర్థిక సహాయం అందించారు. విద్యుత్ ప్రమాదంలో తన స్నేహితుడు చనిపోవడం కలచి వేసిందని వారు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య స్నేహితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విల్లాజ్జియో నిర్మాణాలు చేపడుతాం

**• అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం..! • డివిఎల్‌పిఓ సంధ్యారాణి**

విల్లాజియో ఫామ్ ల్యాండ్ (లోగో)

వికారాబాద్, మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి 27): సిద్దులూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 'విల్లాజ్జియో' ఫామ్ ల్యాండ్‌లో కొనసాగించే నిర్మాణాలపై పూర్తి విచారణ చేపడతామని డివిఎల్‌పిఓ సంధ్యారాణి సూర్య ప్రతినిధితో పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన సూర్య దినపత్రికలో 'విల్లాజ్జియో' నిర్మాణాలకు అనుమతులేవి అనే శీర్షికతో వెలువడిన వార్త తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఆ ఫామ్ ల్యాండ్‌లో కొనసాగే నిర్మాణాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు. గత రెండు రోజుల నుండి సిద్దులూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉన్నందున ఆ ఫామ్ ల్యాండ్ అనుమతులకు సంబందించి రిపోర్ట్ కాస్త ఆలస్యం అయ్యిందని తెలిపారు. వికారాబాద్ ఎంపిఓ నాగరాజును రిపోర్ట్ తేవాలని గత రెండు రోజుల క్రితమే ఆదేశించడం జరిగిందని అతను రిపోర్ట్ ఇంకా తనకు అందించలేదని పేర్కొన్నారు. నేడు ఖచ్చితంగా ఆ ఫామ్‌ల్యాండ్‌పై పూర్తి విచారణ జరుపుతామని, ఈ విషయమై డిపిఓ కూడా ఆ ఫామ్ ల్యాండ్‌పై త్వరితగతిన పూర్తి విచారణ చేపట్టాలని తనకు ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఆ ఫామ్‌ల్యాండ్‌లో ఏదైన అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనుమతులకు మించి నిర్మాణాలు కొనసాగిస్తే చర్యలు తప్పవన్నారు.

# నిర్దేశించిన సమయంలోపు సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలి

**• జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి.

పరిగి మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 27): నిర్దేశించిన సమయంలోపు సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం పరిగి మండలం రంగంపల్లి గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలో మంజూరు అయిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ నిర్దేశించిన సమయంలోపు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని సూచించారు. రంగంపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ తో పాటు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. ఉమేష్, డిఈ సుదర్శన్ రెడ్డిలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు క్వాలిటీ కంట్రోల్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి.

# వికలాగుడికి కాసు శ్రీనివాస్‌రెడ్డి చేయూత



శంకరయ్యకు 1లక్షా 20వేల రూపాయలతో జైపూర్ కాలు అందజేసిన కాసు శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి 27) : మండ పరిదిలోని లింగారావుపల్లి గ్రామ పంచాయతీ రామకృష్ణ పురం గ్రామానికి చెందిన బోడ శంకరయ్య గత రెండు సంవత్సరాల క్రితం ట్రాక్టర్ ప్రమాదంలో తన కుడికాలు మోకాలు కింది భాగం పూర్తిగా తీసివేయబడింది. స్థానిక నాయకులు, పిఏసిఎస్ చైర్మెన్ గట్ల కేశవరెడ్డి ద్వారా శంకరయ్య విషయం తెలుసుకొన్న శతాబ్ది టౌన్షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి స్పందించి 1లక్ష 20వేల రూపాయలతో కృత్రిమ జైపూర్ కాలుకు సంబంధించిన పూర్తి మెటీరియల్ డాక్టర్ల సూచనతో తెప్పించి బాదిత శంకరయ్య కు అందజేయడం జరిగింది. కుంటుంబానికి పెద్ద దిక్కు అయిన శంకరయ్య వికాంగుడిగా మారడంతో కుటుంబ పోషన భారంగా మారిన నేపథ్యంలో శంకరయ్యకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకున్న సందర్భంగా బాదితుడు శంకరయ్య కుటుంబ సభ్యులు శ్రీనివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జోగు రమేష్, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య, మాజీ ఉపసర్పంచ్ మణికంఠ, మాజీ వార్డు సభ్యులు జలంధర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, అచ్చిరెడ్డి, సురేందర్ రెడ్డి, మండల కోఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, పర్తిపురం యాదయ్య, చింతలపల్లి జంగారెడ్డి, రాములు, పడకల్ జగ్గారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామంలోని యువకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ఇంటర్ పరీక్షలు

**• నేటి నుంచి మార్చి 16 వరకు పరీక్షలు**
**• నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ**
**• చీఫ్ సూపరిండెంట్ వెంకట రమణ రెడ్డి**



మంచాల, మేజర్ న్యూస్ (పిబ్ర వరి 27) : నేటి నుండి ప్రారం భమయ్యే ఇంటర్ పరీక్షలకు మండలంలో సర్వం సిద్ధం చేసినట్లు చీఫ్ సూపరిండెంట్ వెంకట రమణ రెడ్డి మంగ ళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుండి మార్చి 16 వరకు కొన సాగనున్నాయని పేర్కోన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 325, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 237 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. నిమిషం ఆలస్యం అయిన పరీక్షకు అనుమతించబోమని, కావునా విద్యార్థులు గంట మందే పరీక్ష హాల్‌కు చేరుకోవాలని సూచించారు.

# జాతీయ ఆరోగ్య మిషన్‌లో డాక్టర్ పోస్టులు దరఖాస్తులు ఆహ్వానం

**• డి.ఎం.హెచ్.వో డా: రఘు నాథ స్వామి**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ ( ఫిబ్రవరి 27): జాతీయ ఆరోగ్య మిషన్ లో ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీ కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తుందని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రఘునాథ స్వామి తెలిపారు. మంగళవారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, ఇందులో మెడికల్ ఆఫీసర్ ఫుల్ టైం, పిల్లల వైద్యుడు, రేడియోలజీ, ఆయుర్వేద, క్షయ వ్యాధి ఆరోగ్య సందర్శకుడు, ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియో తెరపిస్టు, నర్స్, జిల్లా డేటా మేనేజర్, జిల్లా కో– ఆర్డినేటర్, రిఫ్రిజిరేటర్ మెకానిక్ లున్నయన్నారు. దరఖాస్తు ఫారం నోటిఫికేషన్ వివరాలకు https://medchal-malkajgiri.telangana.gov.in మేడ్చల్ జిల్లా అధికారిక వెబ్సైట్ నుండి పొందవచ్చని ఆయన సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులకు అవసరమైన అన్ని స్వయం ధ్రువీకృత నకలు కాఫీలను జతపరుస్తూ , ఈ నెల 28 ఉదయం 10.30 గంటల నుంచి ఏప్రిల్ 5, సాయంత్రం గంటల లోపు కార్యాలయ పని రోజులలో, మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, 1వ అంతస్తు, కాలెక్టరేట్ లో దాఖలు చేసుకోవచ్చని జిల్లా డీ.ఎం. అండ్ హెచ్.ఓ డాక్టర్ : రఘు నాథ స్వామి వెల్లడించారు.

# గ్రామ దేవత బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవాలు

**• భోదునంపల్లిలో మంగళవారం ఘనంగా హోమలు**
**• బుధవారం బొడ్రాయి, బోనాలు, ఒడిబియాలు, అన్నదాన కార్యక్రమాలు**



కేశంపేట్, మేజర్ న్యూస్, (ఫిబ్రవరి 27) : మండల పరిధిలోని భోదునం పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మంగళవారం హోమం, మండప పూజ,విగ్రహాలకు ధాన్యా నివాసం ,పుష్ప నివాస కార్యక్రమాలు వేద పండితుల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరై హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం మంటప పూజ విగ్రహ ప్రతిష్టాపన ,పూర్ణాహుతి ,తీర్థ ప్రసాద వితర ణ, వడిబీయాలు,బొడ్రాయికి నీళ్లు పోసి బోనాలు సమర్పించుట మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు. నిర్వహిస్తున్నట్లు భోదునం పల్లి బొడ్రాయి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు భక్తులు భారీ సంఖ్యలో పూజలు భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# అక్రమంగా తరలిస్తున్న కలప ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడ్డ కలపను తరలిస్తున్న ట్రాక్టర్

దోమ, మేజర్‌న్యూస్ (ఫిబ్రవరి 27): అక్రమంగా కలప తరలిస్తున్న ఓ ట్రాక్టర్నుదోమ రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఆర్ఐ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి సమీపంలో కొందరు వ్యాపారులు అక్రమంగా కలను నరికి ట్రాక్టర్లో తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా, నరికి వేసిన కలపను ట్రాక్టర్లో వ్యాపారులు లోడ్ చేస్తుండగా వాటికి సంబంధించిన ధృవ పత్రాలను సమర్పించాలని చెప్పాము. వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ను పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.